# కష్టానికి తగిన ఫలితముంటుంది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన యూత్ వింగ్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: బీఆర్ఎస్ పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ కష్టానికి తగిన ఫలితం ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. గురువారం బీఆర్ఎస్ యూత్ వింగ్ నాయకులు కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలువగా ఆయన మాట్లాడారు. కష్టాల్లో కూడా పార్టీని కన్నతల్లిలా చూస్తున్న యూత్ వింగ్ నాయకులను పార్టీ విస్మరించదని తెలిపారు. ఇక్కడ యూత్ వింగ్ నాయకులు సతీశ్‌రెడ్డి, ప్రమోద్, దేవరాజు, తిరుపతినాయక్, బంటి ఉన్నారు.



సిరిసిల్ల సమీకృత కలెక్టరేట్‌లో సిద్ధమవుతున్న వేదిక



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

# నేడే మువ్వన్నెల పండుగ

- ముస్తాబైన సమీకృత కలెక్టరేట్
- ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

రాజన్న సిరిసిల్ల, జనవరి 25 (నమస్తే తెలంగాణ): గణతంత్ర దినోత్సవాలకు సమీకృత కలెక్టరేట్ ముస్తాబైంది. భారత గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేయగా గురువారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పరిశీలించారు. కలెక్టరేట్ ఆవరణలో వేదికలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు వేడుకలు నిర్వహిస్తారు. ఉదయం 9.05 గంటలకు కలెక్టర్ అనురాగ్ జయంతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసులతో గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందిస్తారు.

# టెస్ట్‌మ్యాచ్ వీక్షించడానికి తరలిన విద్యార్థులు



ఉప్పల్‌లో మ్యాచ్‌ను తిలకిస్తున్న చెక్కపల్లి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేములవాడ రూరల్, జనవరి 25: చెక్కపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న భారత్–ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్‌ను చూసేందుకు తరలివెళ్లినట్లు హెచ్ఎం కిషన్ తెలిపారు. టెస్ట్ మ్యాచ్‌ను చూసేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు పాఠశాల ఉపాధ్యక్షుడు సంతోష్ మెయిల్ చేయగా స్పందించిన హెచ్‌సీఏ, విద్యార్థులతోపాటు ఇద్దరు ఉపాధ్యాయులకు టెస్ట్‌మ్యాచ్ చూసేందుకు టికెట్‌లను జారీ చేసిందన్నారు.

# రాజన్న మా ఇలవేల్పు

- ఆలయ అభివృద్ధిపై త్వరలోనే సీఎంతో సమావేశం
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- ఆలయంలో ప్రత్యేక పూజలు



మంత్రి సీతక్కకు ఆశీర్వచనం గావించి స్వామివారి చిత్ర పటం ప్రసాదాలు అందజేస్తున్న ఈవో కృష్ణ ప్రసాద్, ఆలయ స్థానాచార్యులు భీమశంకర్

వేములవాడ, జనవరి 24: రాజన్న తమ ఇలవేల్పు దేవుడని, కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క తెలిపారు. ఆదివాసి కుటుంబంగా సమ్మక్క సారలమ్మ జాతరకముందు రాజన్నను దర్శించుకునే ఆనవాయితీ ఉందని చెప్పారు. ఈ మేరకు ఆమె వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యులు భీమాశంకర్, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. వేదమంత్రాలు నడుమ ప్రదక్షిణలు చేసిన ఆమె రాజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం చేయగా, ఈవో కృష్ణ ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. మంత్రిని ప్రభుత్వ విప్ శాలువాతో సత్కరించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, రాజన్న ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ నాగేంద్ర చారి, తహసీల్దార్ మహేశ్ కుమార్ మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అంతకు ముందు మంత్రి విలేకరులతో మాట్లాడారు. మన ఆచారాలకు అనుగుణంగా దేవుళ్లను కొలుచుకుంటామని, అయితే కొందరు ఈ దేశంలో ఈ దేవుళ్లనే కొలవాలని ఆచార సాంప్రదాయాలను ధ్వంసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మన సంస్కృతి సాంప్రదాయాలను చరిత్రను కాపాడుకొని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన మీదే ఉందన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధిపై త్వరలోనే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్ రెడ్డితో సమావేశం అవుతారని తెలిపారు.

# ఓటు నమోదుపై యువతను చైతన్యవంతం చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

రాజన్న సిరిసిల్ల, జనవరి 25 (నమస్తే తెలంగాణ): ఓటరు నమోదుతో పాటు ఓటు హక్కు వినియోగించుకునేలా యువతను చైతన్యవంతం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆరోగ్యకర ప్రజాస్వామ్య నిర్మాణం కోసం అందరం ఒక్కటవుదామని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు అధికారులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం సీనియర్ ఓటర్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమి సన్మానించారు. నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా డీవోఏఆర్ఎస్ (డోర్స్) ఆధ్వర్యంలో చెస్, క్యారం చెస్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డోర్స్ జిల్లా అధ్యక్షుడు, రవాణాశాఖ అధికారి కొండల్‌రావు, అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, గౌతమి, డీపీఆర్వో దశరథం పాల్గొన్నారు.

### టీఎస్ఐపాస్ దరఖాస్తులు పరిష్కరించాలి..

టీఎస్ఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశ్రమల శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన డీఐపీసీ, డీఎల్‌సీ సమావేశంలో పరిశ్రమల ఏర్పాటుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి లైసెన్సులు మంజూరు చేయాలని సూచించారు. ఆర్థిక సహాయం కింద 34 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ. 1,14,69,206, ఎస్టీ లబ్ధిదారులు 18 మందికి రూ. 56,69,003, దివ్యాంగుడికి రూ. 3,16,610, పావలా వడ్డీ కింద ఒకరికి రూ. 15,327 మొత్తం 54 మంది లబ్ధిదారులకు రూ. కోటీ 74లక్షల 66వేలు సబ్సిడీ కింద అమోదించినట్లు తెలిపారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ గణేశ్‌రాం తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో డీఆర్ఎస్సీ సమావేశం నిర్వహించి, ప్రమాదాల నివారణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాలు పెరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నందున నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన మార్గాల్లో స్పీడ్ బ్రేకర్లు, స్ట్రిప్స్, ఎంత వేగంతో వెళ్లాలో సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సీపీఆర్‌పై జిల్లాలోని ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, రోడ్డు భద్రతా క్లబ్ సభ్యులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. రోడ్డు భద్రతా పర్యవేక్షణకు జిల్లా రవాణాధికారి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే ఘటనా స్థలానికి పంచాయతీ రాజ్, రవాణా, పోలీస్ శాఖలు కలిసి వెళ్లి ప్రమాదంపై విశ్లేషించాలని సూచించారు. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే 13 బ్లాక్ స్పాట్‌లను అధికారులతో కలిసి పరిశీలిస్తామని చెప్పారు. జిల్లా రవాణ శాఖ ఆధ్వర్యంలో వాహనదారులకు లైసెన్సులు ఇప్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి వాహనదారుడు లైసెన్సు, ఇన్సూరెన్స్ ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖాధికారి కొండల్‌రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమీ పూజారీ, ఆర్అండ్‌బీ ఈఈ శ్యాంసుందర్, పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాశ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, మున్సిపల్ కమిషనర్లు ఆయాజ్, అన్వేశ్, వేములవాడ ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


# ట్రస్మా బంద్‌ను వెనక్కి తీసుకోవాలి




మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

వేములవాడ, జనవరి 25: వేములవాడలో ఈ నెల 27న ట్రస్మా ఇచ్చిన బంద్‌ను వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్వీ నియోజకవర్గ నాయకుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. వేములవాడలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బందులతో విద్యార్థులు నష్టపోతారని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు దిలీప్, సందీప్, ఫిరోజ్, ప్రమోద్ ఉన్నారు.

# భావనారుషి సేవా సంఘం కార్యవర్గం



వేములవాడలో భావనారుషి సేవా సంఘం కార్యవర్గం

వేములవాడ, జనవరి 25: వేములవాడ పద్మశాలీ భావనారుషి సమాజ సేవా సంఘం కార్యవర్గం ఎన్నికలు గురువారం నిర్వహించినట్లు ఎన్నికల అధికారి చిప్ప యాదగిరి తెలిపారు. అధ్యక్షుడిగా అంజయ్య, ఉపాధ్యక్షులుగా గంగరాజు, రవి, ప్రధాన కార్యదర్శిగా నరేశ్, సంయుక్త కార్యదర్శిగా సుమన్, సహాయ కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా దేవదాసు, డైరెక్టర్లుగా మల్లేశం, ప్రవీణ్, విజయ్, వెంకటమల్లు, శంకరయ్య, గంగారాం, మనోహర్, శ్రీధర్, శేషాద్రి, దేవయ్య ఎన్నికైనట్లు వెల్లడించారు.

# దత్తాత్రేయ ఆలయ అభివృద్ధిపై మంత్రికి వినతి



మంత్రి పొన్నంకు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోయినపల్లి, జనవరి 25: వరదవెల్లి దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ రవీందర్ గురువారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విన్నవించారు. 500 సంవత్సరాల క్రితం వెలసిన దత్తాత్రేయ స్వామి ఆలయం మధ్యమానేరు జలాశయంలో ఉన్నందున రాష్ట్ర దేవాదాయ, టూరిజం శాఖల ద్వారా ప్రత్యేక వంతెన నిర్మించి భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి అభివృద్ధికి హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే నీలోజిపల్లి ఆర్ఎన్ఆర్ కాలనీకి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామంలో బస్సు ఆపాలని ఆదేశించారని పేర్కొన్నారు.

### ఉత్తమ ఫలితాలు సాధించాలి

గంభీరావుపేట, జనవరి 25: ఇంటర్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి మోహన్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం జిల్లా అధికారి సందర్శించి, ప్రీఫైనల్ పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలపై పలు సూచనలు చేశారు. ఇక్కడ ప్రిన్సిపాల్ వెంకట్‌నాయక్, అధ్యాపకులు ఉన్నారు.

### విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు

కోనరావుపేట, జనవరి 25: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రక్తహీనత పరీక్షలను ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు కృష్ణవేణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనతకు చెక్ పెట్టేందుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇక్కడ ప్రిన్సిపాల్ సాగర్, మండల వైద్యాధికారి వేణుమాధవ్ తదితరులు ఉన్నారు.

### బహిరంగ చర్చకు సిద్ధం

కోనరావుపేట, జనవరి 25: అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమని సర్పంచ్ వెన్నమనేని వంశీకృష్ణరావు పేర్కొన్నారు. మర్తనపేట మాజీ సర్పంచ్ తిరుపతి గౌడ్ చేసిన ఆరోపణలపై స్పందిస్తూ గ్రామస్తులతో కలిసి గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామపంచాయతీ పాలకవర్గం, సర్పంచ్ గ్రామాభివృద్ధిలో భాగంగా అవినీతికి పాల్పడితే నిరూపించాలని తెలిపారు. జీపీ నిధులు దుర్వినియోగం చేస్తే ఎలాంటి చర్యలకైనా సిద్ధమని స్పష్టం చేశారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రభుత్వం రేషన్ డీలర్లు సర్పంచ్‌గా పోటీ చేయవచ్చని సర్క్యులర్ జారీ చేయడంతోనే సర్పంచ్‌గా పోటీ చేశానని వివరించారు. ఇక్కడ జీపీ పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

**బహిరంగ ప్రకటన**

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా అద్దంకి జాలయ్య S/o. సుబ్బారావు R/o. వెంకట్రావునగర్, సిరిసిల్ల టౌన్ & జిల్లా గారు సిరిసిల్ల టౌన్‌లోని సాయినగర్ లోని ప్లాట్ నెం. 24, సర్వేనెంబర్లు 729/A, 729/B, లలో విస్తీర్ణం: 242 చ.గ.లలో గృహ నిర్మాణం చేయుటకు లోను నిమిత్తము నాక్లయింటు CANFIN HOMES LTD కరీంనగర్ బ్రాంచ్ గారిని సంప్రదించినారు. లోగడ అద్దంకి జాలయ్య గారు ఇట్టి ప్లాటులో 121 చ.గ.లను యశోద శ్రీహరి S/o. భూమయ్య R/o. సిరిసిల్ల గారి నుండి రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 6458/2013 ద్వారా & 121 చ.గ.లను జాగీర్ పర్శరాములు S/o. ఎల్లయ్య R/o. గాజులపల్లె గ్రామం , ఎల్లారెడ్డిపేట మం॥ సిరిసిల్ల జిల్లా గారి నుండి రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 5555/2017 ద్వారా ఖరీదు చేసినారు. ఇట్టి డాక్యుమెంట్ల యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ రిజిష్టర్డ్ సేల్‌డీడ్ నెం. 1215/2004 పోయినదని అద్దంకి జాలయ్య గారు తెలిపినారు. కావున ఇట్టి డాక్యుమెంటు పై గాని లేదా పై ప్రాపర్టీ పై గాని ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల వ్రాత పూర్వక ఆధారాలతో (15) రోజులలో క్రింది చిరునామలో గల వారికి తెలుపగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరాలు లేవని భావించి సదరు లోను మంజూరు విషయంలో CANFIN HOMES LTD కరీంనగర్ బ్రాంచ్ వారు ప్రొసీడుకాగలరు.

ఇట్లు: **సాన చంద్రమోహన్**
అడ్వకేట్ (TS/138/1995) ప్లాట్ నెం.303, శ్రీసాయి ఎవెన్యూ ముకరంపుర, కరీంనగర్.
సెల్ :9666077777, 9141499999

# ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవం



గంభీరావుపేట: ఓటరు దినోత్సవంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీపీ కరుణ

వేములవాడ రూరల్, జనవరి 25: వేములవాడ మండల అగ్రహారం, పాలిటెక్నిక్, వేములవాడ తహసీల్ కార్యాలయంలో జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటర్ ప్రతిజ్ఞ చేశారు. అగ్రహారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తహసీల్దార్ మహేశ్ పాల్గొన్నారు.

గంభీరావుపేట, జనవరి 25: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో గురువారం జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. కొత్తపల్లి పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ వంగ కరుణ పాల్గొన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందని తహసీల్దార్ భూపతి సూచించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. సర్పంచులు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోనరావుపేట, జనవరి 25: తహసీల్ కార్యాలయ ఆవరణలో గురువారం తహసీల్దార్ విజయ్ ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ రజిని, అంగన్‌వాడీ టీచరు నర్మద, అరుణ ఉన్నారు.

బోయినపల్లి, జనవరి 25: మండల కేంద్రంలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్ కార్యాలయ ఆవరణలో విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, ఏపీవో గంగాధర్, తిలక్ ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. గురువారం విద్యార్థులు ఓటు విలువను తెలుపుతూ కళాశాల నుంచి కొత్త బస్టాండ్ వరకు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు.

సిరిసిల్ల టౌన్, జనవరి 25: ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఆర్డీవో ఆనంద్‌కుమార్ సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా గురువారం సిరిసిల్లలో నిర్వహించిన ఓటరు అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అంబేద్కర్ చౌక్ నుంచి గాంధీచౌక్ వరకు విద్యార్థులు ర్యాలీగా వెళ్లి ఓటరు అవగాహన ప్లకార్డులు ప్రదర్శించారు. ఎస్ఐ రాజు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చందుర్తి, జనవరి 25: మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

రుద్రంగి, జనవరి 25: రుద్రంగి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, కృష్ణవేణి స్కూల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీలత, కృష్ణవేణి స్కూల్ ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు, బూత్ లెవల్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.




సిరిసిల్ల టౌన్ : ఓటరు అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

### మాక్ పోలింగ్

ఇల్లంతకుంట, జనవరి 25 : మండల కేంద్రంలోని శ్రీవాణి విద్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మాక్ పోలింగ్ నిర్వహించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

### యువతి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: గుండారం గ్రామానికి చెందిన మూడావత్ శిరీష(20) మంగళవారం నుంచి కనిపించకుండా పోయిందని ఆమె తల్లి రాజేశ్వరి ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. శిరీష మంగళవారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ పరీక్షలు రాసేందుకు వెళ్లి తిరిగి రాలేదని వచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

### ఒకరి రిమాండ్

కోనరావుపేట, జనవరి 25: వెంకట్రావుపేటలోని మూలవాగు నుంచి ప్రభుత్వ అనుమతితో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల వద్ద బలవంతంగా ట్రాక్టర్‌కు రూ.150 వసూలు చేస్తున్న ఒకరిని అరెస్టుచేసినట్లు ఎస్ఐ అంజనేయులు తెలిపారు. గ్రామానికి చెందిన తాడు మల్లేశం అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాడన్న సమాచారం మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపినట్లు తెలిపారు.

### చెస్ పోటీలకు ఎంపిక

వేములవాడ రూరల్, జనవరి 25: నూకలమర్రికి చెందిన కట్ట వినయ్‌కుమార్ సౌత్‌జోన్ జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు యువజన సంఘాల నాయకుడు సోమినేని బాలు పేర్కొన్నారు. శాతవాహన యూనివర్సిటీలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న వినయ్‌కుమార్ ఈ నెల 26 నుంచి 29 వరకు తమిళనాడులోని భారతీదాసన్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే నూకలమర్రికి చెందిన పొత్తూరి అనిల్‌కుమార్ కోచ్‌గా ఎంపికయ్యాడు. సర్పంచ్ తిరుపతి, ఎంపీటీసీ దేవవ్వ, సీవైసీ అధ్యక్షుడు జగదీశ్ వారికి అభినందనలు తెలిపారు.

### ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: మండల కేంద్రానికి చెందిన ఎరుపుల బన్నీ అనే యువకుడు గురువారం బైక్‌పై బస్టాండుకు వెళ్తుండగా డివైడర్‌కు ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.

# కవితా రచనలో వైశాలి రాష్ట్రస్థాయి ప్రతిభ




హైదరాబాద్‌లో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న వైశాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: బండలింగంపల్లికి చెందిన గొల్లపల్లి రాజయ్య–మంజుల కూతురు వైశాలి కవితా రచనలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నవంబర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కవితా రచన పోటీల్లో ఆమె మొదటి బహుమతిని సాధించగా గురువారం హైదరాబాద్‌లో గవర్నర్ తమిళిసై ప్రశంసా పత్రాన్ని అందజేశారు. వైశాలిని గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

### విద్యార్థులకు టీషర్టులు అందజేత

ఇల్లంతకుంట, జనవరి 25 : దాచారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గురువారం టీషర్టులు అందజేశామని సర్పంచ్ పొన్నం పరశురాం, ఎంపీటీసీ తిరుపతి తెలిపారు. గ్రామానికి చెందిన పామల సుభాష్ తన తల్లితండ్రులు శ్యామల–సుదర్శన్ జ్ఞాపకార్థం ఈ టీషర్టులు అందజేశారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాణి, ఉప సర్పంచ్ కాంతా రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ జ్యోతి, నాయకులు సంజీవరెడ్డి, దేవీరెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.

### కేంద్ర పథకాలపై అవగాహన

ముస్తాబాద్, జనవరి 25: తుర్కపల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా గురువారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పద్మ అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను టీవీ ద్వారా ప్రదర్శించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ గూడెం బ్రాంచ్

# సిరిసిల్లలో డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జనపాల శంకరయ్య

రాజన్న సిరిసిల్ల, జనవరి 25 (నమస్తే తెలంగాణ): సీనియర్ సిటిజన్ల కోసం సిరిసిల్లలో డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జనపాల శంకరయ్య కోరారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య అధ్యక్షతన క్రీడాపోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డేకేర్ సెంటర్ కోసం గతంలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈనెల 28న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమాలకు వచ్చే వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, శ్రీహరి, సిరిసిల్ల రాజేశ్వరి, శ్రీధర్, జ్ఞానోబ, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నిఘా నేత్రాల దిగ్బంధంలో పెద్దలింగాపూర్



పెద్దలింగాపూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్ఐ

'ఇల్లంతకుంట, జనవరి 25 : పెద్దలింగాపూర్ గ్రామాన్ని నిఘా నేత్రాలతో దిగ్బంధం చేశామని ఎస్ఐ దాస సుధాకర్, సర్పంచ్ గొడిసెల జితేందర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెద్దలింగాపూర్ కూడళ్లలో 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో దొంగతనాలు, అపరిచిత వ్యక్తులు తిరుగకుండా, అల్లరి మూకల ఆటలు కట్టించడానికే ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వారు వెల్లడించారు. త్వరలో సీసీ కెమెరాలను ప్రారంభించి వాటికి నిధులు అందించిన దాతలను సత్కరిస్తామన్నారు.